


నూరేళ్ళ తెలుగు కథకు
నవ్య నీరాజనం - 83
నూరేళ్ళ తెలుగు కథకు

# మా నాన్న గురజాడకు వారసుడు


- డా. చాగంటి కృష్ణకుమారి



కళింగాంధ్రలో ఊపిరి పోసుకున్న తెలుగుకథను చాసో చేరదీసి పెంచి పోషించాడు. విజయనగరం గంటస్తంభానికి దీటుగా దాన్ని నిలిపాడు. ఓ చేత్తో చుట్ట పట్టుకుని, మరో చేత్తో కనుబొమలను దిద్దుకునే చాసో తెలుగు కథ తీరు తెన్నులను కూడా సరిదిద్దాడు. శ్రీశ్రీ, అరుద్రలంతటి గొప్పవారు 'సెబాసో' అన్న చాసో గురించి వారి అమ్మాయి కృష్ణకుమారి జ్ఞాపకాలు మీ కోసం. ఇది దీపావళి ప్రత్యేకం.


అప్పుడు నా కారేళ్లు. చాసో తన సంసారాన్ని విజయనగరం నుంచి లచ్చుమ్మపేటకు మార్చాడు. అక్కడ చాగంటి కుటుంబాలకు చెందిన ఏక పెనక తాటాకు ఇళ్ల వరుసకి ఆ చివర్న రోడ్డు మీద పొగడ చెట్టు ఉండేది. కొంతమంది పిల్లలతో కలసి నేను ఆ చెట్టు కింద ఆడుకొంటున్నాను. ఎవరో నన్ను పిలిచి ''నువ్వు ఎట్టి సోమయాజులు కూతురివే కదూ'' అన్నారు. ''కాదు నేను చాగంటి సోమయాజులు కూతుర్ని'' అన్నాను. నా కంఠస్వరంలో చిన్నిపాటి గర్వం తొణికిసలాడినట్టు గుర్తు. అది పసి పిల్లలకు తండ్రిపై సహజంగా ఉండేదే! ''ఆహాఁ అలాగా! ఏం చేస్తాడేమిటి మీ నాన్న?'' అన్నారు. ''సంతకెళ్లి కూరలు తెస్తాడు''– అన్నా ''అబ్బా! అంతపని చేస్తాడా? ఎన్ని కూరలు తెస్తాడేంటి?'' అని అడిగారు. ''బస్తాతో బస్తాడు'' అని చెప్పా. మా నాన్న కజిన్ కొండబాబు. మేము కొండ నాన్న అనే వారం. అతని పేరు చాగంటి వెంకట సోమయాజులు. నల్లని ఛాయలో ఉండేవాడు. ఆయన విజయనగరంలో కొంతకాలం ఎంఎల్ఏ గిరీ చేశాడు.

నేను అలా సమాధానం చెప్పిన రోజుకి చాలా చాలా ఏళ్ల కిందటే నాన్న 'చిన్నాజీ' కథల సంపుటాన్ని అచ్చు వేసుకొని స్నేహితులకు పంచు కొన్నాడు. ఎంపు, కుంకుడాకు మొదలైన ఓ పాతికపైన కథలని రాసి అచ్చుకి పంపించదగ్గవిగా తను 'టిక్' చేసుకొని భారతి, రూపవాణి, ఆనందవాణి, అరసం ప్రత్యేక సంచికల వంటి పత్రికలకి పంపి అచ్చులో చూసుకొన్నాడు. 'ఆమెత' కథ కూడా అప్పటికే రాసేశాడు. దానిని అచ్చుకిచ్చాడు కానీ అచ్చుప్రతిని చూసుకోలేదు. ఆ కథ పోయిందని అంటూ ఉండేవాడు. పిల్ల తప్పిపోతే తల్లి పడే వేదన ఆ కథ పట్ల ఆయనకు ఉండేది. 1994 జనవరిలో ఆయన చనిపోయాక అది దొరికింది. 1996, చాసో స్ఫూర్తి మద్రాసు సభలో నేను దానిని చదివి వినిపించాను. మరుసటి రోజు మద్రాసు ఆకాశవాణి వారు నా చేత మళ్లీ చదివించి రికార్డు చేసి ప్రసారం చేశారు.


మనుమడు శంకర్, మనుమరాలు పావని, మనుమడు ఆనంద్‌తో....

## చాసో దత్తుడు

చాగంటి బాపిరాజు గారు చనిపోతూ భార్య తులశమ్మ గారిని పిల్లలు లేని కారణం చేత కొడుకును దత్తత చేసుకోవలసిందిగా విల్లు రాశారు. మరణానంతరం చేసే కర్మకాండలకి తద్దినాలకి కొడుకు ఉండాలి. తులశమ్మ గారు తన సవితి తల్లి వాడ్రేవు సుందరమ్మ గారి మనమడు కానుకొలను లక్ష్మీనారాయణశర్మ, తులశమ్మ దంపతుల పెద్దకొడుకు నరహరిరావును దత్తత చేసుకొంది. కానుకొలను తులశమ్మ గారు చాగంటి తులశమ్మగారికి సవితి అప్పగారు. పెద్దకొడుకైన నరిహరిరావే నాకు కావాలని పట్టుపట్టి ఆమె పెంపకానికి తెచ్చుకొంది. 1915 మాఘశుద్ధ విదియ నాడు ఉత్తరాంధ్ర శ్రీకాకుళంలో పుట్టిన నరహరిరావు దత్తత స్వీకారం అయ్యాక చాగంటి సోమయాజులుగా మారాడు. చాగంటి తులశమ్మగారికి, భర్త వైపు నుండి తల్లి గారి వైపు నుండి ఆస్తి ఉండేది. ఆమె తన మేనమామగారైన కస్తూరి నరసరాజుగారి మనమరాలు కాదంబరి అన్నపూర్ణను కోడలిగా తెచ్చుకొని చాసోతో వివాహం జరిపించింది. చాసో తన 13వ ఏటన వివాహితుడయ్యాడు.


కుమార్తె కృష్ణకుమారితో....

చాసో శ్రీకాకుళంలో ఎస్ఎస్ఎల్‌సి పాసయ్యే దాకా ఉన్నాడు. ఇంగ్లీషులో పద్యాలు రాస్తూ ఉండేవాడు. ఎస్ఎస్ఎల్‌సి పాసయ్యాక 13, 14 ఏళ్ళ వయసులో విజయనగరం తల్లిగారింటికి వచ్చాడు. మహారాజా కళాశాలలో ఇంటర్‌లో చేరాడు. అప్పుడు రోణంకి అప్పలస్వామి గారితో స్నేహం కుదిరింది. అప్పలస్వామి గారికి తన ఇంటి మేడమీద గదిని అద్దె పుచ్చుకోకుండా ఇచ్చాడు. ఆయన అక్కడ ఉంటూ కాలేజీలో చదువు కొన్నాడు. చాసో ఇంటి ప్రక్కనే ఉన్న చాగంటి వెంకట సోమయాజులు ఇంట్లో శ్రీరంగం నారాయణబాబు అద్దెకు ఉండేవాడు. రోణంకి, చాసో, నారాయణబాబులు ముగ్గురూ మంచి స్నేహితులయ్యారు. కాలేజీకి వచ్చే బ్రిటిష్ పత్రికలలోని సాహిత్యం చదివి వామపక్ష భావాల వైపుకి మొగ్గారు. రోణంకి అప్పలస్వామి స్వంతంగా డిక్షనరీలు చూసుకుంటూ ఇంగ్లీషు, ఫ్రెంచ్ వంటి యూరోపియన్ భాషలను చదువుకొని పాండిత్యం సంపాదించాడు. ఫ్రెంచ్ కవుల రచనలను మూలంలోనే చదివి చాసోకి నారాయణబాబుకి వినిపించేవాడు. ఆ ముగ్గురు చాసో ఇంట్లో కూర్చుని సమకాలీన సాహిత్య చర్చ చేస్తూ ఉండేవారు. అప్పట్లో భావ కవిత్వం దేశంలో బాగా ప్రచారంలో ఉంది. చాసో మొదటి నుండి సాహిత్యాన్ని చారిత్రక దృక్పథంతో చూడాలని భావించేవాడు. దేశంలో ఉప్పు సత్యాగ్రహం కొనసాగుతోంది. జలియన్‌వాలాబాగ్ మారణహోమం దేశంలో తీవ్ర సంచలనం రేపింది. అటువంటి సమయంలో ఊహా ఊర్వశులపై ప్రేమగీతాలు రాయడాన్ని వస్తురీత్యా చాసో నిరసించాడు. భావ కవిత్వపు సాహిత్య విలువను కాదనలేదు. వాటిలోని

కళను మెచ్చు కొన్నాడు. చాసో తను రాసిన ఇంగ్లీషు గేయాలలో భాష బుకిష్ అనీ, తనకు నేరుగా ఇంగ్లీషు వారి జీవితాలలో పరిచయం లేని కారణం చేత వారి వాడుకభాష తన గేయాలలోకి రాలేదనీ భావించి, మీటర్ పరంగా, వస్తుపరంగా మంచివే అయినప్పటికీ వాటిని చింపి పారేశాడు. తెలుగులో కవిత్వం చెప్పడం ప్రారంభించి 'ధర్మక్షేత్రం' కవితలో రెండవ ప్రపంచ యుద్ధ బీభత్సాన్ని చిత్రీకరించాడు. ఆ రోజులలో చాసో రాసిన కవితలు ఢంకా, తెలుగుతల్లి మొదలైన పత్రికలలో వచ్చేవి. తరువాత కథలు రాయడం మొదలుపెట్టాడు. భగత్‌సింగ్ ఆశయాల వైపుకి ఆకర్షితుడయ్యాడు. మార్క్సిస్టు దృక్పథంతో కథా రచన చేశాడు. అభ్యుదయ రచయితల సంఘం ఆవిర్భావంలో చాసో క్రియాశీల పాత్ర నిర్వహించాడు. ఆరుద్ర సమగ్రాంధ్ర సాహిత్యం 13వ సంపుటి 'ఆధునిక యుగం అభ్యుదయం, పుట్టు పూర్వోత్తరాలు-చాసోపాత్ర' పై విపులంగా రాశాడు. 1945 ప్రాంతాలలోని 'వందేమాతరం' పత్రికలలో చాసో 'థామస్' కలం పేరుతో నవీన సాహిత్య లక్షణాల గురించి వ్యాసాలు రాసాడుట. వాటిలో అధునాతన పాశ్చాత్య సాహిత్య ధోరణులని గురించి వివరించేడని ఆరుద్ర మద్రాసు చాసో స్ఫూర్తి సభలో చెప్పడం జరిగింది. అయితే అప్పటి 'వందే మాతరం' సంపుటాలు దొరికితే తప్ప ఆ వ్యాసాలు సేకరించడం జరగని పని. చాసో 'మెరుగు' అనే నాటిక రాశాడు. దానిని 1958 విజయనగరంలో జరిగిన రాఘవ నాటకోత్సవాలలో ప్రదర్శించారు. దానికి ఉత్తమ రచన, ఉత్తమ ప్రదర్శనా బహుమతులు వచ్చాయి. అప్పట్లో అచ్చులో రాలేదు. 2008 సంవత్సరం 'సాహిత్య నేత్రం' -జులై-డిసెంబర్ సంచికలో అచ్చు అయింది.

## నాన్న గది, కోల అద్దం; అద్దంలో పిచిక ముందు పిచిక

నాన్న గదిలో టేబుల్‌పైన ఒక కోల అద్దం ఉండేది. గది గుమ్మం లోంచి, కిటికీలోంచి పిచ్చుకలు దూరి డాబా గది నాదులలో గూళ్లు కడుతూ గదిలో గడ్డి గాదరా రాలుస్తూ ఉండేవి. రెట్ట వేసేవి. అద్దం ముందు చేరి అద్దంలోని పిచ్చుక ముక్కును పొడుస్తూ ఉండేవి. వాటితో నేను ఆడుకొంటూ ఉండేదాన్ని. ఒక రోజు పిచ్చుక బయటకు వెళ్లి పోకూడదని గది తలుపు వేసాను. అంతటితో ఆగకుండా అందకపోయినా ఎగిరి మరీ గడియవేసాను. పిచ్చుకతో ఆడుకొన్నంతసేపు ఆడుకొన్నాక తలుపు తీయబోయాను. రాలేదు. గడియ అందటం లేదు. ఎగిరి తీయబోయాను రాలేదు. గడియం అందటం లేదు. ఎగిరి తీయబోయా. అది బిగుసుకు పోయింది. రావటం లేదు. చాలాసేపు అయిపోయింది. భయంతో తలుపులు బాదాను. సంగతి తెలుసుకొని అంతా గది గుమ్మం దగ్గర చేరారు. బామ్మ, చిట్టిబామ్మగారు, రాజు నాన్న ''తలుపు బద్దల కొట్టు, సోమయాజులూ పిల్ల బెంబేలు పడిపోతుంది'' అంటూ తొందర చేసారు. 'మరేం పర్వాలేదు. అదే తీసుకోగలదు' అంటూ కిటికీలోంచి నన్ను చూస్తూ ''ఏడుపు మాని నిదానంగా తీయడానికి ప్రయత్నించు. వస్తుంది'' అని చెప్పాడు. నన్ను నేను కుదట పరచుకొని ఎగురుతూ ఎగురుతూ కొద్ది కొద్దిగా అందుకొంటూ గడియ తీయగలిగాను. నాలుగైదేళ్ల వయసులో నాన్న నాకు చెప్పిన పాఠం అది. స్వయం కృషికి స్వంతంగా చదువుకొని జ్ఞానాన్ని పెంచుకోవడానికి ఆయన పెద్ద పీట వేసేవాడు. డిగ్రీల కోసం చదివే చదువులు, చదువులు కాదనే వాడు.

## లచ్చమ్మ పేటలో కురిసిన వాన, నాన్న, నేను, నీటి బుడగ

విజయనగరం చిన్ని పల్లి బడిలో ఒకటవ తరగతి చదువుతూ ఉండగా మేము లచ్చమ్మపేట వెళ్లిపోయాము. బామ్మ కాళహస్తీశ్వర శతకంలో పద్యాలు చదువుతూ ఉండేది. ఇంట్లో గజేంద్ర మోక్షం, ప్రహ్లాద చరిత్ర పద్యాలు మారుమ్రోగుతూ ఉండేవి.

ఒకరోజు వాన కురుస్తోంది. తాటాకు చూరు నుండి వాన నీరు జారి నేల మీద పడుతోంది. నేను నాన్న అరుగుమీద నిలుచుని చూస్తున్నాం. చూరు నుండి జారుతున్న నీరు నేల మీద చిన్నచిన్న గోతులను చేస్తోంది. వాన నీరు కాలవ కట్టి ఎర్రమట్టిని తోసుకొంటూ పెరట్లో పల్లం వైపుకి ప్రవహిస్తోంది. ఆ ప్రవాహంలో నీటి బుడగలు-చిన్నవి, మరీ చిన్నవి; పెద్దవి మరీ పెద్దవి-కొన్ని పుట్టిన వెంటనే 'టప్'మంటున్నాయి. కొన్ని ప్రవాహంలో తేలుతూ పోతున్నాయి. కొన్ని కొంచెం దూరం దాకా వెళ్లి పగిలి పోతూ ఉంటే మరికొన్ని కాస్త ఎక్కువ దూరం వెళ్లి మాయమవు తున్నాయి. దృశ్యం చాలా అందంగా ఉంది. నేను వాటిని నాన్నకు చూపిస్తూ ఏదో మాట్లాడుతున్నాను. నాన్న బుడగని చూస్తూ దానిని 'బుద్బుదం' అంటారని చెప్పాడు.

వెంటనే నేను

'చక్రి చింతలేని జన్మంబు జన్మమే
తరల సలిల బుద్బుదంబు కాక...'

లో బుద్బుదము ఇదీ ఒకటేనా? అని అడిగా.

''అవును. అదే ఇది. అంటే నీటి బుడగ. చూసావుగా దాని బతుకు క్షణికం -ఎక్కువ సేపు ఉండదు'' అన్నాడు.


అలా 'బుద్బుదం' అనే పదాన్ని నేర్చుకొన్నా. దాని అర్థం ఏదో చాలా తెలిసి పోయినట్టుగా నాకా రోజు అనిపించింది. డిగ్రీ క్లాసుకి వచ్చాక Soap bubbleపై పాఠం చదువుకొన్నప్పుడు కెమిస్ట్రీ క్లాసులో 'Bubbled through' అనే పదాన్ని వాడిన ప్రతీ సారీ ఆనాటి ఆ బుద్బుదాలు నా కళ్ల ముందుకొచ్చి నిలిచేవి. లెక్చరర్‌ని అయి, తెలుగులో కెమిస్ట్రీ చెప్పాల్సి వచ్చినప్పుడు 'bubbled through' అనే పదానికి 'బుద్బుదీకరించి' అని చెపుతూ నేను పొందిన ఆనందానికి కారణం ఆనాటి ఆ నీటి బుడగలే! చాసో పాఠం చెప్పే తీరు అలా ఉండేది. ''తెలుగును మర్చిపోయినప్పుడే చాసోని మరచిపోవడం'' అని ఆరుద్ర అన్నమాట గుర్తు తెచ్చుకోవచ్చు.

## నాన్న, నేను, నీలి చామంతి

లచ్చమ్మపేటలో మా పెరట్లో పూలమొక్కలను పెంచేవారం. ఓ నీలి చామంతి మొక్క కొమ్మకి దగ్గర దగ్గరగా గుత్తులు గుత్తులుగా మొగ్గలు వచ్చాయి. నల్లని చీడ ఆ కాడకీ, మొగ్గల మొదల్లలోనూ చేరింది. నాన్న ఆ కొమ్మకి ఒకే ఒక మొగ్గను వుంచి మిగిలినవన్నీ తీసేశాడు. కాడకి పట్టిన చీడను ఆకును మడిచి సున్నితంగా దానితో నొక్కుతూ చంపేశాడు. అటువంటి పనులు చేస్తున్నప్పుడు నేను ఆయన వెంట ఉండేదాన్ని. అంత దగ్గర దగ్గరగా మొగ్గలుంటే వాటి వేటికీ పూర్తిగా విచ్చుకోడానికి జాగా ఉండదు. బలంగా పువ్వులుండవు. కుంటి పువ్వులు, గుడ్డి పువ్వులు వస్తాయ్ అని చెప్పాడు. కొమ్మకి వదిలిన నీలి చామంతి మొగ్గ మనం ఆడుకొనే రింగ్ అంత పెద్దదిగా విచ్చుకొంది. కథా రచనలో కూడా చాసో ఈ విధానాన్ని పాటించాడా అని నాకనిపిస్తుంది. ఆనాటి ఆ నీలిచేమంతి, కాడకి చచ్చుపడిపోయిన నల్లని చీడ నా జ్ఞాపకంలో మిగిలిపోయాయి. ఎంచుకొన్న వస్తువుని ఆవిష్కరించడంలో శిల్పాన్ని చెడగొట్టే అంశాలు రచనలో చేరి పొడుగు సాగితే చాసో దానిని 'బోదకాలు' పెంపకం అనే వాడు.

## పచ్చి మిరపకాయ, బావిలో చంద్రుడు

లచ్చమ్మపేటకి వెళ్లిన కొన్నాళ్లకి నాన్న నన్ను కల్లేపల్లి హైస్కూల్‌లో నేరుగా 6వ తరగతిలో చేర్పాడు. లచ్చమ్మపేటలోని చాగంటి కుటుంబాల నుండి ఏ ఆడపిల్లనీ స్కూల్‌కి పంపడం లేదు. కొంతమంది మొగ



భార్య అన్నపూర్ణతో..

పిల్లలు మాత్రం వెళుతూ ఉండేవారు. ఎవరితోనో ఒక రితో స్కూల్‌కి వెళుతూ ఉండేదాన్ని. స్కూల్ నుండి వస్తూ వేరుశెనగ పొలాలలోకి వెళ్లి ఆ మొక్కలను పీకి వాటి వేర్లకి ఉన్న లేత శెనగకాయలను తినేవారం. వాక పొదలలో వాక్కాయాలను ఏరుకొనే వారం. ఒకరోజు చిన్నాడు మిరప పొలం లోకి వెళ్లి పచ్చిమిరపకాయ తను తిన్నాడు. నాకోటి ఇచ్చి అస్సలు కారం లేదు తిని చూడమన్నాడు. కాస్త కొరికానో లేదో నోరు మండి పోతోందని ఏడుపు. వాడికేం చేయాలో తోచలేదు. దగ్గర్లో నేల బావి ఉంది. నాకు అల్యూమినియం కేరియర్‌లో కింద గిన్నెలో పెరుగు అన్నం, పై గిన్నెలో పప్పు అన్నం పెట్టి స్కూల్‌కి పంపేవారు. వాడు దానిపై గిన్నెని తీసి బావిలో నీరు అందుకో బోయాడు. వాడి చేతికి అందలేదు. గిన్నె అంచును రెండు వేళ్లతో పట్టుకొని వంచబోయాడు. అది జారి పోయింది. అప్పుడు సూర్యాస్తమయం అయిపోవచ్చింది. చంద్రోదయం అయి చంద్రుడు బావి నీటిలో ప్రతి ఫలిస్తున్నాడు. గిన్నె ఇటు అటూ ఊగుతూ నీళ్లు నింపుకొంటూ నీటిలోకి పూర్తిగా జారిపోయింది. నీటిలో చంద్రుడు ముక్కలైపోయాడు. ఇంతలో ఎవరో రైతు కల్లేపల్లి నుంచి సామాన్లు కొనుక్కుని ఆ వైపుగా వచ్చాడు. సంగతి తెలుసుకొని, నెత్తిమీద తట్ట దింపుకొని, తను తెచ్చుకున్న పంచదార పొట్లం విప్పి, నా నోట్లో కొంత పంచదార వేశాడు. నేల బావి చాలా ప్రమాదం. ఎప్పుడూ దీని దగ్గరికి రాకండి అని చెప్పాడు. ఇంట్లో విషయం తెలిస్తే తంతారని చిన్నాడికి భయం పట్టుకొంది. ఏదో కల్పించి చెప్పాలం టాడు వాడు. నేను నిజమే చెప్పాను.

ఒకసారి పడిన వానకి చెరువు పూర్తిగా నిండిపోయింది. మేము కల్లేపల్లి ఆ చెరువుదాటి వెళ్లాలి. రైతు ఒకతను నన్ను భుజం మీద కూర్చో పెట్టుకొని చెరువు దాటిస్తే నా పుస్తకాల సంచినీ ఇంకెవరో పట్టుకొని చెరువు దాటారు. ఇటువంటివే కొన్ని సంఘటనల తరువాత 'చిన్నపిల్లని పొలాల వెంబటి, చెరువుదాటి స్కూల్‌కి పంపుతూ దాన్ని కష్ట పెడు తున్నానా' అని అనుమానం వచ్చిందట నాన్నకి. ఓరోజు నన్ను దగ్గర కూర్చో పెట్టుకొని స్కూల్ గురించి అడుగుతూ, మధ్యలో ఏవో చిన్నచిన్న ప్రశ్నలు వేస్తూ నా చేత వాగించాడుట. నేను ఎంతో ఉత్సాహంతో ఎన్నో సంగతులు చెప్పానుట. బావిలో గిన్నె మునిగిపోవడం, చంద్రుడు ముక్కలైపోవడం వర్ణించి వర్ణించి చెప్పానుట. 'నువ్వు స్కూల్‌కి వెళ్లి రావడంతో ఆనందం పొందుతున్నావనీ ఆ నడక నీకు శ్రమ కాదనీ అర్థం చేసుకొన్నాను. అందువల్ల నిన్ను ఆ సంవత్సరం కల్లేపల్లికి పంపడం కొనసాగించాను' అని నేను నా కూతుర్ని సైకిల్ పైన స్కూల్‌కి పంపుతున్న రోజులలో నాకు చెప్పారు.

మరుసటి ఏడు విజయనగరానికి పాక్షికంగా సంసారాన్ని మార్చి నన్ను మునిసిపల్ హైస్కూల్‌లో ఏడవ తరగతిలో చేర్చడానికి తీసికెళ్లాడు. అప్పుడు కొటికలపూడి రామదాసుగారు హెడ్ మాస్టర్‌గా ఉండేవారు. ఆయన దగ్గరకు నన్ను తీసుకొనివెళ్లి-చూడండి-ఇది కల్లేపల్లిలో 6వ తరగతి చదివింది. స్టాండర్డ్ సరిపోకపోతే మళ్లీ 6వ తరగతిలోనే చేర్చుకొన్నా అభ్యంతరం లేదు అన్నాడు. ఆయన నన్ను తెలుగు పద్యం చదవమన్నారు. నేను 'మందార మకరంద..' చదివాను. అమ్మాయి మీ కూతురంటున్నారు; పద్యం చదవమంటే సీస పద్యం చదివింది. 7వ తరగతిలో చేర్చుకొంటాం; అన్నాడు రామదాసుగారు.

దేశంలో ప్రతీ ఆడపిల్లకీ, మొగపిల్లాడికీ తప్పనిసరిగా స్కూల్ ఫైనల్ వరకూ చదువు ఉండాలని చాసో అభిలాష. విజయనగరం మా ఇంటిలో ఎప్పుడూ ఎవరో ఒక వారాల అబ్బాయి ఉండేవాడుట. వారంలో ఆరు రోజుల పాటు వేరే ఇళ్లల్లో వారాలు కుదిరేదాకా చాసో తన ఇంట్లో భోజనం పెట్టేవాడు. కుదిరాక ఒక రోజు చాసో ఇంట్లో భోజనం. అలా స్కూల్‌కి వెళ్లి చదువుకొనేవారు. మహారాజా వారి సత్రంలో ఏర్పాటు అయ్యేంతవరకూ విద్యార్థులను ఈ విధంగా చాసో ఆదుకొనే వాడు. నేను అక్కడ ఉమన్స్ కాలేజీలో లెక్చరర్‌గా చేరాక కూడా ఒక అమ్మాయి మా ఇంట వారం చేసుకొని చదువుకొంది. ఆ ఏర్పాటు చాసో చేశాడు.


రోణంకితో....

### నచ్చినవి

| | | |
|---|---|---|
| నవల | : | మాలపల్లి |
| నాటకం | : | గురజాడ వారి కన్యాశుల్కం |
| ఇష్టమైన వారు | : | తోరూదత్, సరోజినీనాయుడు |
| రంగు | : | తెలుపు |
| కాలం | : | చలికాలం |
| చెట్టు | : | మానుగట్టిన మామిడి చెట్టు |
| పువ్వు | : | నాగజెముడు, కలవపువ్వులా పూసిన పువ్వు మహాప్రీతి |
| కూర | : | కాకరకాయ |
| నటుడు | : | ఎస్వీ రంగారావు |

### గురజాడకు వారసుడు చాసో

గురజాడ అప్పారావు గారి దేశభక్తి గీతంలోని

'పూనుస్పర్థను విద్యలందే
వైరములు వాణిజ్యమందే
వ్యర్థ కలహం పెంచబోకోయ్
కత్తి వైరం కాల్చవోయ్'

అన్న నాలుగు వాక్యాలు ప్రపంచ భాషలన్నింటిలోకి అనువాదం చేసి ఐక్యరాజ్య సమితి భవనంలో పొందుపరచాలని తను ఒకసారి ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పాడు. చాసో గురజాడ వారసుడు.

తన పెంపుడుతల్లిని గౌరవంగా ప్రేమగా చూసుకొన్నాడు చాసో. ఆమెను సంతృప్తిపరచడం తన ధర్మం అని భావించాడు. తను నిరీశ్వరవాది అయినా, నమ్మకం లేకపోయినా యజ్ఞోపవీతం ధరించి లింగధారిగా తను పెట్టవలసిన పెద్దలందరి తద్దినాలు, తల్లి చనిపోయాక తల్లి అంత్య క్రియలు, తద్దినాలు యధావిధిగా పెట్టాడు. తన దత్తత యొక్క ప్రధాన లక్ష్యం అదే కనక, తన తల్లి తనను ఎంచుకొని మరీ పెంచుకొంది కనక ఆమె పట్ల విధేయుడై ఉన్నాడు. తన మరణానంతరం తన కళ్లనూ, దేహాన్ని దానం చేయవలసిందిగా కోరాడు. ఆయన కోరికను భార్య పిల్లలు మన్నించారు.

**- డా.చాగంటి కృష్ణకుమారి**


సోమసుందర్ షష్టిపూర్తి సభలో....

## నాకు నచ్చిన మా నాన్న కథ

# పోనీ తిను

**- చాసో**

కళ్ళు ఎవర్ని చూస్తున్నాయో! ఎందుకు చూస్తున్నాయో! రెప్పలు ఎత్తుతున్నాది దించుతున్నాది. నల్లగుడ్లు జీడిగింజల్లాగున్నాయి. తుమ్మెదల్లా పొడుస్తూ చూస్తున్నాయి. కదలదు. పిలిస్తే పలకదు. డిపార్టుమెంటల్ స్టోర్సు షట్టర్స్ పక్కనే షట్టరుని ఆనుకుని మొజాయిక్కు మెట్టుమీద, మొజాయిక్కు పోర్టికో క్రింద చాచుకుని స్వతంత్రంగా పడుకుంది. ఎవత్తో కాదు. మీరంతా ఎరుగుదురు - గుడిసేటు గున్నమ్మ.

షాపులన్నీ తెరిచేవేళ అవుతున్నాది. ఎండ తూర్పు నించి వ్యాపిస్తున్నాది. మేడల చివర్లు ఎండలో ఎర్రగా మెరుస్తున్నాయి.

పాచిపని చేసే పనిమనిషి మూడుసార్లు వచ్చి వెళ్ళింది. గున్నమ్మ లేవ లేదు. పని మనిషి బాల్చీ, చీపురు, ముగ్గు డబ్బా పట్టుకొని షాపుకు వెళ్ళి మెట్లు తుడుస్తుంది. కడుగుతుంది. కల్లాపు జల్లుతుంది. ముగ్గు పెట్టి వెళుతుంది.

''నెగు'' అని పాచిపని మనిషి గట్టిగా అరిచింది. అరుపులకే గున్నమ్మ లేచే స్థితిలో లేదు.

''బారెడు పొద్దెక్కింది'' అని ఇంకా బిగ్గరగా అరిచింది. గున్నమ్మ వినిపించుకోలేదు. కాళ్ళూ, చేతులూ ఎక్కడా కదలటం లేదు. కంటి పాపలు మాత్రం కదులుతున్నాయి. అటూ యిటూ చూస్తున్నాయి.

''మంచి చోటే ఒచ్చి పడ్డాది... ముసలమ్మా నెగు'' అని చెంబులో నీళ్లు మొహం మీద జల్లింది. నీళ్ళు గున్నమ్మ మొహం మీద, బట్ట మీద, అరుగునిండా పడ్డాయి. గున్నమ్మ కదలలేదు. అది ఎలాగ పడుకున్నది అలాగే పడుకుంది.

''నీ కిలాక్కాదు'' అని చీపురుతో రెండు పోట్లు పొడిచింది. గున్నమ్మలో చలనం లేదు. అది ఈ లోకంలో ఉన్నట్లు లేదు. అపస్మారకంలోకి పోయినట్టే ఉంది.

''ఇంక నా వల్ల కాదు'' అనుకొంది పాచి పని మనిషి.

''అది ఇంకేం నేస్తుంది'' అన్నాడు రోడ్డు తుడుస్తున్న మునిసిపల్ పని వాడు.

''నాయన్నాయన, కొంచెం దాన్ని నెగ్గొట్టుదూ'' అన్నది పాచిది.

''కనబడ్డం నేదా? రోగం ముంచు కొచ్చీసింది. అలాగొగ్గి ఆళ్లే సూసు కుంటారు'' అన్నాడు మునిసిపల్ పని వాడు.

నిన్న మొన్నటిదాకా గున్నమ్మ ముచ్చటగా ఉండేది. వయసులో ఎవరైనా గువ్వలాగుంటారు. గున్నమ్మ అరవై యేళ్లు పై బడ్డా గువ్వలాగే ఉంది.

ఆర్నెల్ల క్రితం ఊళ్లో పోలీసు పెద్దలు వ్యభిచార గృహాల మీద దాడి జరిపినప్పుడు పాతికమంది పడుచులతో పాటు గున్నమ్మా పట్టుబడ్డది. మేజిస్ట్రేట్ ఏభై రూపాయలు జరిమానా వేస్తే ఎడం చేత్తో పారేసింది.

దాని సంపాదన అంతా యింతా కాదు. అరవై యేళ్ళదీ పాతికేళ్ళ పడుచులా తయారయేది. పాతికేళ్ళ ఈడు కుర్రాళ్లు ఎగాదిగా చూసేవారు! ఎవర్ని పిలవాలో, ఎప్పుడు పిలవాలో, ఎక్కడ పిలవాలో, ఎలాగ పిలవాలో దానికి తెలుసు. అది ముసల్దో, ముతకదో కనపడేది కాదు. గున్నమ్మ పిలిచిందా గుడిసెలోకి దూరవలసిందే!

గున్నమ్మ గురించి చెప్పాలంటే బుచ్చిబాబు మాట చెప్పేయ్యాలి. వో సాయంకాలం - రెండేళ్ళ క్రితం బుచ్చిబాబుని గున్నమ్మ గుడిసెలోకి ఈడ్చుకుపోయింది. కళ్ళ పొరలు కమ్మి బుచ్చిబాబు దాని వెంట గుడిసెలో దూరిపోయాడు. అందరికీ తెలిసిపోయింది. వీధిని పడిపోయాడు. తాగుబోతులకీ, వ్యభిచారులకీ సిగ్గా, లజ్జా? ఇహ్హిహీ అని నవ్వేశాడు. ఆ బుచ్చిబాబే ఇప్పుడు మన పట్టణానికి ఛైర్మన్! ఏమిటీ అని అడక్కండి. అదంతే!

అలాంటి గున్నమ్మ ఒక్క నెల రోజుల్లో ఆర్చుకుపోయింది. వయస్సు బైట కొచ్చీసింది. మంచం పట్టేసింది. మరి గడప దాటలేదు. ఏ జబ్బు ప్రవేశించిందో కాలూ చెయ్యీ కట్టి పడేసింది.

### నచ్చింది ఏమిటంటే?



మా నాన్న రాసిన కథలలో నాకు నచ్చినవి చాలానే ఉన్నాయి. వాటిలో 'పోనీ తిను' (పోన్తిను) ఒకటి. ఆ కథలో ఏమిటి నచ్చిందంటే.

అపస్మారక స్థితి నుండి చావుకి చేరువవుతూ, కళ్లు నిలబెట్టేసి గుడిసేటి గున్నమ్మ తన 'గూడొదిలేసిందా'కా చివరి ఘడియలని నడుపుకొస్తూ, ఆమె పాత్రనీ, చుట్టూ ఉన్న సమాజపు తీరుతెన్నులనీ మన ముందుంచుతూ, ఆమె అంతిమయాత్రను సమస్యగా మలచగలగడం లోని నేర్పు, గున్నమ్మలోని అమ్మని సులువుగా ఆవిష్కరించగలగటం లోని కథా శిల్పం నాకు నచ్చాయి. 'పోన్తిను, పోన్తిను' అని చెప్పిన ఆమె కంఠస్వరం కొడుకు జగన్నాథస్వామి బుర్రలో చుట్టి చుట్టేసిందని చెపుతూ తిరిగి గున్నమ్మలోని తల్లిపైనే వెలుగునంతా ప్రసరింపచేసి ఆమె కళ్లు 'నిలబడిపోయాయి' అంటూ మనని కళ్ల నీళ్ల పర్యంతం చేయగల ముగింపు నచ్చింది.


- డా. చాగంటి కృష్ణకుమారి
సెల్: 98851 63304

అంతకుముందు రోజూ సాయంకాలం టీ నీళ్ళు తెప్పించుకు తాగింది. గుడిసెలోనే పడుకుంది. తెల్లారి చూస్తే డిపార్టుమెంటల్ స్టోర్సు మెట్టు మీద పడి ఉంది.

జనం ఆగిపోతూ వచ్చారు. వాళ్ళకి అక్కరలేంది లేదు.

పద్దుల గుమాస్తాగారు- అదే పెద్ద గుమస్తాగారు తాళాలు పట్టుకు వచ్చారు. షాపు తెరవాలి. అడ్డంగా గున్నమ్మ పడుకుని ఉంది. షట్టరుని ఆను కొని బోరచాచుకొని శవంలా పడుకుంది. షట్టరు తాళం కప్ప దాని తల దగ్గరుంది.

చాలా షాపులు తెరిచేశారు. కొందరు తెరుస్తున్నారు. మేడ చివరి భాగాన్ని ఎండ తెల్లబడి



కళ్ళల్లో పడుతున్నాది. సేల్సు అమ్మాయిలు, అబ్బాయిలు వచ్చేశారు. అంతా ముసిల్దాన్ని లెమ్మని కేకలు వేశారు.

అది ఈ లోకంలో ఉందో లేదో అపస్మారకంలో ఉన్నట్టే ఉంది. కాళ్ళూ, చేతులూ ఏ మాత్రం కదలడం లేదు. కళ్ళు మాత్రం తెరుస్తున్నాది, మూస్తున్నాది. నల్లగుడ్లు కుంకుడు గింజల్లా అటూ యిటూ కదులు తున్నాయి. వెతుకు తున్నట్టు చూస్తున్నాయి. ఎవరిచేతనైనా గున్నమ్మని ఎత్తి తీయించవలసిందే. తనంత తాను లేవదు.

''మునిసిపల్ పనివాళ్లు ఉంటారు. వాళ్ళని తీసుకురండి. వాళ్ళకి టీ నీళ్ళకి చేద్దాం'' అన్నారు తెగించి పద్దుల గుమస్తాగారు. జనం ఊరుకోరు.

''పద్దుల గుమస్తాగారు చెప్పేరు. అలాగ్గా చెయ్యండి'' అన్నారు జనం లోంచి ఎవరో.

''ఎవరా మాట అన్నది?'' అంటూ కోపంతో మండిపడిపోయారు గుమస్తాగారు. పద్దుల గుమస్తా అంటే ఆయనకి వల్ల మాలిన కోపం. ఊరంతా పద్దుల గుమస్తాగారని పేరు పెట్టేశారు. ఆ మాట అంటే ఆయనకి చిర్ర. ఆయన్ని మేనేజరుని చెయ్యలేదని అసలు లోపల ఉన్న మంట.

''పెద్ద గుమస్తాగారు'' అన్నారు మరెవరో.

''అలాగనండి మర్యాద ఇవ్వకపోతే ఎలాగ తగలడను?'' అన్నారు గుమస్తాగారు. మునిసిపల్ పనివాళ్ళు వచ్చారు.

''ఆఁ వచ్చారా? చూడండి. ఆ ముసలమ్మని అక్కణ్ణుంచి లేవనెత్తి కాస్త పక్కగా రోడ్డు మీద పడుకోబెట్టాలి'' అన్నారు.

''చావ సిద్ధంగా ఉంది. ఎవరి షాపు ముందు పెట్టేదామనుకున్నావు'' అని ఎవరో గద్దించారు.

''అలాగేనండి. నాకూ తెలుసు. మా షాపు పక్క కాస్త ఎడంగా పెట్టిస్తాను. సరేనా?'' అన్నారు గుమస్తాగారు.

''చూడండి. ఎక్కడకొచ్చి తిష్టవేసిందో? ఊళ్ళో ఇంకెక్కడా చోటు లేనట్టు. ఇది దానబ్బ సొంతం అయినట్టు!'' అన్నారు గుమస్తాగారు. డిపార్టుమెంటల్‌స్టోర్సు చాలా ఖరీదైన సిమెంటు కాంక్రీటు బిల్డింగు. దాని చుట్టూ చుట్టబెట్టి అరుగు ఉంది. ఇలాంటి అసందర్భపు వాళ్లు జేరకుండా అరుగులకి రంగు రంగుల గాజు పెంకులు సిమెంటులో బిగేయించారు. బిల్డింగు చుట్టూ మణుల వడ్డాణం లాగుంటుంది.

అలాంటిది ఈ ముసిలి గున్నమ్మ మొజాయిక్కు మెట్టుమీద మొజాయిక్కు పోర్టికో కింద హాయిగా పడుకుంది. చోటు ప్రశస్తంగా ఉంది. చేరుకుంది.

''ఇంకా ఆలోచిస్తారేం? తీసి వారగా రోడ్డు మీద పడెయ్యండి'' అన్నారు గుమస్తాగారు. ముసిల్దాకత్తి ముందు కొచ్చింది. గున్నమ్మ ఈడూంది.

''రోడ్డు వార ఏల? కాలవ వూర దానికి గుడిసె ఉంది. దాని గుడిసెలో దాన్ని పడెయ్యండి'' అన్నది.

''చెప్పావు కావు! ఇకనేం. చూపించు ముసలమ్మా దాని గుడిసెక్కడో పడేస్తారు'' అన్నారు గుమస్తాగారు. మునిసిపల్ పనివాళ్ళు ముందుకి రాలేదు. నిలబడిపోయారు. గుమస్తాగారి నోట్లోంచి పలుకు రాలేదు. అందుకు చూస్తున్నారు.

''వాళ్లకేమిస్తారో చెప్పండి. త్వరగా కానివ్వండి. అది చావ సిద్ధంగా ఉంది'' అని వొకరు సలహా ఇచ్చారు.

''ఏం కావాలో మీరే చెప్పండి చెప్పారు కారేం?'' అన్నారు గుమస్తాగారు.

''ముగ్గురం ఉన్నాం. పదిహేను ఇప్పించండి'' అన్నాడో పనివాడు.

''పది హేనే!'' అని కళ్ళు తేలేశారు గుమస్తాగారు.

''గుడిసేటు గుడిసెలకి ఇక్కణ్ణుంచి దాన్నెత్తుకెళ్లొద్దూ?'' అన్నాడు పనివాడు.

''ఆర్రూపాయలిస్తాను, తలో రెండు''.

''మా వల్ల కాదు'' అన్నాడు పనివాడు.

''రూపాయి తగ్గేది లేదు'' అన్నాడు మరో పనివాడు. పక్క షాపు ఆర్య వైశ్యుల వారు గమనిస్తున్నారు. కలుగ జేసుకున్నారు.

''ఏవఁయ్యో, నిన్నటి నుంచి ధనిష్టాపంచకం. తెలిసిందా? పది రూపాయలిస్తారు పడెయ్యండి'' అన్నారు ఆర్యవైశ్యులవారు.

''ప్రొప్రయిటరు గారు ఏవంటారో! వారి కత్తికి రెండు వేపులా వాడి ఉంటుంది. అంతడబ్బు ఎందుకిచ్చావూ? అనవచ్చు. వెధవ డబ్బు ఎందుకిచ్చాశావు కావూ అనవొచ్చు. మధ్య నా కొచ్చింది నక్కచావు'' అన్నారు గుమస్తాగారు.

''ఏమీ అండు ధనిష్టాపంచకమయ్యా. ఏమర్రా తీసుకుపోండి పది ఇచ్చేస్తారు'' అన్నారు వైశ్యుల వారు.

''సరే పదీ ఇస్తాను. నేననలేదు కాని వారన్నారు. వారి మాట ప్రకారం తీసుకుపోయి, ఇక్కడా అక్కడా కాదు. దానికి గుడిసె ఉందిట. ఆ గుడిసెలో పడెయ్యండి'' అన్నారు గుమస్తాగారు. వారి భయం సబవైనదే. డిపార్టుమెంటల్ స్టోర్సు ప్రొప్రయిటర్ శ్రీ జగన్నాథ స్వామి గారు పాతికేళ్ళ కుర్రాడు. గుమస్తాగారికి డెబ్బయ్యో పడి వచ్చింది. ఆయన వయస్సు ఆలోచ నకి ఈయన వయస్సు ఆలోచనకి పొసగదు. శ్రీ జగన్నాథస్వామి తండ్రి గారు రంగనాయకులు గారైతే, గుమస్తా గారెంతంటే అంతా ఒప్పుకొనే వారు. మాటకి విలువ ఇచ్చేవారు. ఆయన చచ్చి స్వర్గాన ఉన్నారు. కుర్రకారు పెత్తనం వచ్చిపడ్డది.

ఆ మునిసిపల్ పనివాళ్లు అడుగు వెయ్యలేదు.

''పది రూపాయలిస్తామంటే తెగులా? మనిషిని కాస్తదూరం తీసుకెళ్లడానికి'' అన్నాడు. గుంపులోంచి ఓ న్యాయవాది. న్యాయవాది అంటే ప్లీడరు కాదు. న్యాయం చెపుదామనుకున్నవాడు.

''ఆ పదీ పుచ్చుకొని తమరే పడెయ్యండి. పదిహేనుకి చిల్లిగవ్వ తగ్గం'' అన్నాడు పనివాడు.

''చూశారా చూశారా! వాళ్ళ బుర్ర తిరుగుడు. నెత్తి మీదున్నాయిరా మీ కళ్లు'' అన్నారు న్యాయవాది గారు.

''రామాయణంలో పిడకలవేటలా వచ్చిన వాళ్లు వచ్చినట్లుండరు. సరే త్వరగా తీసుకుపొండి. మీరడిగిన పదిహేను ఇస్తారు'' అన్నారు ఆర్యవైశ్యుల వారు.

''ఇదిగో వారు చెపుతున్నారు. పదిహేను ఇస్తాను. పడెయ్యండి'' అన్నారు పద్దుల గుమస్తాగారు.

అప్పటికి మునిసిపల్ పని వాళ్లు మెట్టు దగ్గరకు వెళ్లారు. ముసిల్దాని మొహంలోకి చూశారు.

''ఒరిదిరా గుడిసేటు గున్నమ్మ! ఎలాగై పోయిందో! ఇంతింత బుగ్గలతో గునగునలాడుతూ ఉండేది'' అన్నాడు పనివాడు.

''ఔనో! గున్నమ్మ! ఎప్పుడూ కొప్పుమీద కొప్పంతెత్తు పువ్వులు ముడిచేది'' అన్నాడు రెండో పనివాడు.

''దీన్ని ఎలాగ ఎత్తడం!'' అన్నాడు మూడో పని వాడు.

''నాబునేదు. తాటాకు సాప తెప్పించండి'' అన్నాడు మూడో పనివాడు.

''ఇప్పుడు చాపెక్కడొస్తుంది? త్వరగా సుళువుచేసి తీసుకుపోండి'' అన్నారు వైశ్యులవారు.

''చాప మీద జార్చి ఎత్తుకెళ్లాలి. లేకపోతే ఏళ్లాడిపోతుంది. ఇక్కడ నుంచి కాలవొడ్డుకి ఎళ్లొద్దా?'' మూడో పని వాడు.

''సాప తెప్పించండి'' అన్నాడు రెండో పనివాడు. వాళ్ళు మెట్టు దిగిపోయారు.

''ఖర్మ ఖర్మ! ఒరే సైకిలు మీద గభాల్న వెళ్ళి చాప కొనుక్కురా. తాటాకుల చాప'' అని డబ్బులిచ్చి షాపులో కుర్రాణ్ణి పంపించాడు గుమస్తాగారు.

''సిక్కి సెల్యామైపోయింది!'' అన్నాడు ఓ రిక్షా వాడు.

''గొప్పగా బతికిందిలే. కట్టని కోకనేదు. ఎళ్ళని సినిమా నేదు'' అన్నాడు మరో రిక్షా వాడు.

''ఒట్టినే సినీమాకి ఎళ్ళేదా! ఎళ్ళిందంటే ఎవణ్ణో ఒకర్నో ఏసుకొచ్చేది'' అన్నాడు మరో రిక్షావాడు.

''ఈః'' అని పెద్ద మూలుగు ముసలమ్మ మూలిగింది. దాని మొలగుడ్డల్లోంచి నీరుడు కారడం మొదలెట్టింది. మొజాయిక్కు మెట్టు మీంచి దిగి మొజాయిక్కు చప్టామీంచి చిన్న ప్రవాహం కట్టి రోడ్డు మీద పడి కుంచెడు మడుగు కట్టింది.

''ఈ'' అని గున్నమ్మ పళ్లు బిగించి పిడికిళ్లు బిగించి పెద్ద మూలుగుడు మూల్గింది.

''మరణ వేదన'' అన్నాడొకడు.

''నారాయణ – నారాయణ'' అన్నాడింకొకడు.

''వెళ్ళి దాని చెవుల్లో అను'' అన్నాడు మరో ప్రక్కవాడు.

రోడ్డంతా దుర్గంధం వ్యాపించింది.

''చూడు చూడు'' అన్నాడు మునిసిపల్ పనివాడు. అంతా పరీక్షగా చూశారు. గున్నమ్మ కళ్ళుచూస్తున్నే ఉన్నాయి.

''కళ్లు నిలబెట్టేసింది'' అన్నాది గున్నమ్మ ఈడు ముసలమ్మ.

''గూడొదిలేసింది'' అన్నాడు జనంలో తాత్వికుడు.

''అనుకున్నంతా అయింది'' అన్నారు ఆర్యవైశ్యుల వారు.

''ఏమిటి సాధనం?'' అన్నారు గుమస్తాగారు.



"ఏముంది? అనాథ ప్రేత సంస్కారం" అని వెళ్లేరు ఆర్యవైశ్యుల వారు.
"గూటిలో సిలకేదిరా"
సిన్నన్న.
గూటిల్ల సినబోయెరా"
అని పాడుకుంటూ పోయాడు తాత్వికుడు.

సైకిలు మీద వెళ్ళిన కుర్రవాడు చాప పట్టుకు వచ్చాడు.

"నూకలు సెల్లిపోయినాయి. సచ్చింది ఆ నాడు పుర్గటాలు సావు సచ్చిందా? సావనేదు" అన్నది గున్నమ్మ ఈడు ముసలమ్మ.

పాతికేళ్ల క్రితం గున్నమ్మ పురుడురాక రోజుపూట గిలగిల కొట్టుకుని తెలివి తప్పిపోయింది. ఆస్పత్రికి తీసుకెళితే కడుపుకోసీ తల్లినీ బిడ్డనీ వేర్పాటు చేశారు.

అప్పుడు బతికేసింది. ఇప్పుడు డిపార్టుమెంటల్ స్టోర్సు మొజాయిక్కు మెట్టుమీద మొజాయిక్కు పోర్టికో కింద చచ్చిపోయింది. శవంలా లేనే లేదు. బతికున్నట్టే ఉంది. రెండు కళ్లు జ్యోతుల్లా వెలుగుతూ రెప్పవాల్చ కుండా చూస్తున్నట్టే ఉన్నాయి.

వార్త వెళ్ళింది. గుడిసెల వాళ్ళు ఈనీశారు. మెయిన్‌రోడ్డు వెనక మురికి కాలువ పొడుగునా గుడిసెలే. అందులో వో గుడిసె గున్నమ్మది. గుడిసెల నిండా గులగుల్లాడుతూ– నులక మంచం పగుళ్ళలో నల్లుల్లాగ – గుడిసేట్లే వచ్చి పడ్డారు.

వో నడివయస్సుది గున్న మీదికెళ్ళి పడిపోయి శోకాలు మొదలెట్టింది.

"ఎంత పని చేసినావే గున్నమ్మా. ఇంక మాక్కనబడవే గున్నమ్మ? నీ గుడిసె నీకుండగా దిక్కుమాలిన చోట సచ్చినావే గున్నమ్మా?" అంటూ రాగం తీసింది. దాని గొంతుకతో కలుపుతూ మరి ముగ్గురు ఏడుపు మొదలెట్టారు. దాంతో గున్నమ్మ చావు – చావుకళ కట్టింది. అదృష్టవంతురాలు గున్నమ్మ ఒంటరిదైనా ఏడ్చేవాళ్ళు ఉన్నారు. మీద పడి ఏడుస్తున్నారు. అందరికీ తలలో నాలుక లాగుండేది. ఉపకారపు బుద్ధితో ఉండేది.

కారొచ్చింది. డిపార్టుమెంటల్ స్టోర్స్ ప్రొపయిటరు శ్రీ జగన్నాథ స్వామి గారు వచ్చారు. ఆ గందరగోళంలో దిగారు. పద్దుల గుమస్తాగారు ఎదుట కెళ్లారు.

"బాబూ కొంప మునిగింది. గుడిసేటు గున్నమ్మట. మన షాపు మెట్టు మీద చచ్చింది!" అని చెప్పారు. శ్రీ జగన్నాథస్వామి గారు దిగి చూశారు. ఆయన మాత్రం ఏమీ చేయగలరు?

"గున్నమ్మట ఎవత్తో గున్నమ్మ! మన నెత్తిని చుట్టుకుంది" అన్నారు పద్దుల గుమస్తాగారు.

గున్నమ్మ, గున్నమ్మని శ్రీ జగన్నాథస్వామి గారు బాగా ఎరుగుదురు. పొద్దున్నే శ్రీ జగన్నాథస్వామి గారి నెత్తిని చుట్టుకొంది.

గున్నమ్మ ఎప్పుడు శ్రీ జగన్నాథస్వామి గారి షాపులోనే బట్టలు కొనుక్కునేది. కౌంటర్ దగ్గర నిలబడి పోయి వెయ్యి వెటకారాలాడుతూ వెయ్యి బేరాలాడేది స్వామి మాత్రం ఎప్పుడూ పైసా తగ్గించలేదు. డబ్బు ఇచ్చేసేది. ఒక మాట మాత్రం అని వెళ్ళిపోయేది.

"తగ్గించవా? పోన్తిను" అనేది. ఎప్పుడూ కొసకామాట అనేది. ఆ కొస మాట శ్రీ జగన్నాథస్వామిగారికి గుర్తుకు వచ్చింది.

"దాన్నవతలికి పంపితే కాని షాపు తెరవలేం" అన్నారు గుమస్తాగారు.

"ఇంక షాపు ఏం తెరుస్తాం? దీని కోసం షాపు ముయ్యవలసిందే! ఎక్కడా చోటు లేనట్టు ఇక్కడ చచ్చింది" అన్నారు శ్రీ జగన్నాథస్వామిగారు.

గున్నమ్మ ఈడు ముసల్ది తోసుకు వచ్చింది.

"చోటు నేకకాదు. నెత్తికొరివి ఎట్టే కొడుకువని ఇక్కడి కొచ్చి చచ్చింది. నువ్వు గున్నమ్మ కొడుకువి. మీ బాబు పెంచినాడు" అన్నాది ముసలమ్మ. ముసలమ్మ ముందుకు వచ్చి చెప్పక ఉండలేక పోయింది. దానికి నిజం తెలుసు, చెప్పేసింది.

శ్రీ జగన్నాథస్వామి గారు నిలువునా నీరై పోయారు.

ఎదురుగా ఉన్నది తన తల్లా? తలకి కొరివి పెట్టే కొడుకని వచ్చిందా?

ముసిల్ది అన్నమాట నిజమే. శ్రీ జగన్నాథస్వామి దత్తుడు. రంగనాయకులు గారు పిల్లలు లేక ఆస్పత్రిలో నుంచి పురిటి గుడ్డుని తెచ్చుకున్నాడు. గున్నమ్మ దగ్గరే! గున్నమ్మకి నూరు రూపాయలు, చీరా యిచ్చాడు.

కుల, మత, వర్గ, రహిత సమాజం గుడిసేట్ల సంతానం. అందుకే రంగనాయకులు గారు సాభిప్రాయంగా శ్రీ జగన్నాథస్వామి పేరు పెట్టేరు. అటువంటివి ఆమోదించే వాడు దేశంలో ఆ దేముడొక్కడే!

శ్రీ జగన్నాథస్వామికి తాను దత్తుణ్ణని తెలుసు. ఆస్పత్రి నుంచి తెచ్చుకున్నారనీ తెలుసు.

గున్నమ్మ తన తల్లా? తన కొట్టుకి వస్తూనే ఉండేది. గున్నమ్మ కొసమాట గుర్తుకి వస్తూ కంపించిపోయాడు.

"తగ్గించవా? పో న్తిను" అంటూ వేళ్లేది!

"పోన్తిను, పోన్తిను!" అతని బుర్ర చుట్టచుట్టేసింది.

గున్నమ్మ అక్కడ చచ్చిపోడానికి రాలేదు! నెత్తిని కొరివిపెట్టే కొడుకని రాలేదు. ఆఖరిసారిగా కొడుకుని చూసుకోడానికి వచ్చింది. బతుకల్లా చూసుకుంటూనే ఉంది. ఆఖరికి చూడకుండా చచ్చిపోయింది.

ఆ కొడుక్కోసం దాని కళ్ళు వెతుక్కుంటూ, వెతుక్కుంటూ నిలబడిపోయాయి. ఆ కళ్ళు కొడుక్కోసం చూస్తూనే ఉండిపోయాయి. చూస్తూనే ఉన్నాయి.

★

కవిత




## ప్రియా.... నీ చూపు....

నా దేహపు కాన్వాస్‌ని సుతారంగా తాకిన తూలిక
అణువణువును రగిలించే ప్రణయ జ్వాలిక
చూపులు రూపులు మార్చుకుని అధరాలుగా మారి
ఆనందపుటాన వాళ్ళెన్నెన్ని ఉంచుతాయో
నా దేహ మహతి పై కాంక్షా తంత్రులు శృతి చేసి
ఎన్నెన్ని రాగాలు పలికిస్తాయో
రాగ వేదిక లాంటి తనువుపై, గజ్జకట్టిన పాదాలై
ప్రణయ పదఘట్టన లెన్ని చేస్తాయో
రంగు రంగుల పుప్పొడులై, నా దేహ ప్రాంగణాన
రాగ రంజిత రంగవల్లులెన్ని సింగారిస్తాయో
మేఘమాలికలై నన్నాశ్లేషింప
ఎన్ని హర్ష పులకాంకురాలు మొలకెత్తుతాయో
స్నిగ్ధ నవచూతమైన నా తనువుపై
ముగ్ధ కోయిలలై కలరవ కిలికించితాలెన్ని చేస్తాయో
వసంత ఋతు చైతన్య స్పందనలై
తనువులోని అణువణువూ పుష్పింప చేస్తాయి
శత సహస్ర భ్రమరాలై
అనురాగ పరాగ సంపర్క శోభితం చేస్తాయి
పుష్ప వృష్టులై నా దేహాన్ని ముంచెత్తి
సర్వ సుమనస్సౌరభ్య సంవాసితం చేస్తాయి
జాహ్నవీ జల ధారలై తనువంత తడిపి
అర్పణార్ఘ్యంగా ఎంత పవిత్రీకరిస్తాయో
చివరకు నీవు – నేను అన్న సరిహద్దు చెరిపేసి
అర్ధనారీశ్వర తత్త్వాన్ని ఆవాహన చేసి
త్వమేవాహం అంటూ నినదించి
అద్వైత తత్త్వానికి ఆనవాళ్ళై నిలుస్తాయి

–ప్రసాద వర్మ కామఋషి
సెల్:94412 74034